క్లుప్తంగా

బాలచౌడేశ్వరి అమ్మవారికి పూజలు



ఉరేగింపుగా ఆలయానికి వెళ్తున్న భక్తులు

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలో శ్రీబాలచౌడేశ్వరి అమ్మవారి ఉత్సవాలు ముసిగి 16 రోజులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పొంగళ్లతో ఉరేగింపుగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని అమ్మవారి వేపచెట్టు వద్దకు చేరుకుని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా తొగట వీర క్షత్రియులు కత్తిసాము ప్రదర్శించారు.

బహిరంగ వేలం పాట నిర్వహణ



దుత్తలూరు: మండలంలోని నర్రవాడలో వెలసిన శ్రీవెంగమాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 23వ తేదీ నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో తాత్కాలిక అంగళ్లకు అద్దె వసూలు చేసుకునే హక్కు కోసం ఆ దేవస్థానం కార్యాలయ ఆవరణలో శుక్రవారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. కలిగిరి మండలం తెల్లపాడుకు చెందిన గునిశెట్టి వెంకటరత్నం రూ.8 లక్షలకు ఈ హక్కులు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ ఉషశ్రీ, కోవూరు గ్రూపు దేవస్థానాల కార్యనిర్వహణాధికారి సీహెచ్ కృష్ణప్రసాద్, సర్పంచ్ నాగయ్య, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు బెల్లంకొండ పెదభద్రయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనులు ప్రారంభం



పొలం దున్నుతున్న రైతు

సీతారామపురం: నైరుతి రుతుపవనాల ప్రభావంతో మండలంలో తొలకరి వానలు కురవడంతో వాతావరణం చల్లబడింది. తరచూ వర్షాలు కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనులను ప్రారంభించి పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈ ఏడాది రుతుపవనాలు సకాలంలో రావడంతో సాగుపై అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తూ ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచుతూ సాగుకు సన్నద్ధం చేస్తున్నారు.

విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు

దుత్తలూరు: మండలంలోని నర్రవాడ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని డిస్కం ఏఈ వెంకటసుబ్బయ్య శుక్రవారం తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఓ మోస్తారు వర్షం

కలిగిరి: మండలంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉరుములు, మెరుపులతో ఓ మోస్తారు వర్షం కురిసింది. ఇటీవల కురిసిన వర్షాలకు పొలాలు పదునెక్కి దుక్కులు దున్నడానికి అనుకులంగా మారాయి. పొలాల్లో దుక్కులు దున్నడానికి రైతులు సన్నహాలు చేస్తున్నారు. వర్షాలతో వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

బుజ్జిరెడ్డి మృతికి సంతాపం

సంగం: సంగంకు చెందిన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం బుజ్జిరెడ్డి గుండెపోటుతో మృతిచెందారు. శుక్రవారం నెల్లూరులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి హాజరైన బుజ్జిరెడ్డి ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలిపోయారు. వైద్యశాలకు తరలించగా అక్కడి వైద్యులు మృతిచెందినట్లుగా నిర్ధారించారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. బుజ్జిరెడ్డి మృతి పట్ల బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి ఆంజనేయరెడ్డి, జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, నేతలు, కార్యకర్తలు సంతాపం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణానికి విద్యుత్ సరఫరా చేసే సబ్‌స్టేషన్, 11 కేవీ ఫీడర్ నిర్వహణ దృష్ట్యా మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ యు.మన్మథరావు శుక్రవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎల్ఆర్‌పల్లి, జేఆర్‌పేట, పంటవీధి, క్రిస్టియన్‌పేట తదితర ప్రాంతాల్లో 3 గంటల చొప్పున విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

ప్రభుత్వ బడి.. ప్రవేశాల సందడి

సర్కారు బడుల్లో మెరుగైన వసతులు

- కార్పొరేటుకు ధీటుగా ఫలితాలు
- ప్రభుత్వ బడుల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి
- ప్రవేశాలపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి
- సెలవుల్లో అడ్మిషన్లపై ఫోకస్



ఉదయగిరి: గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మనబడి నాడు–నేడు కార్యక్రమం ద్వారా సర్కారు బడులను కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా అభివృద్ధి చేసి మెరుగైన వసతులు కల్పించడం, బోధనలో ప్రత్యేక మార్పులు తీసుకురావడంలో విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు కార్పొరేట్ స్కూళ్ల విద్యార్థులకు పోటీగా ఫలితాలు సాధించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల్లో వచ్చిన ఫలితాల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ విద్యార్థుల అడ్మిషన్లపై ఫోకస్ పెట్టారు. ఉన్నత పాఠశాలల పరిధిలో ఉన్న సమీప గ్రామాలు, ప్రాంతాలకు వెళ్లి ప్రభుత్వ బడిలోనే తమ పిల్లలను చేర్పాలని తల్లిదండ్రులను కోరుతున్నారు. ప్రభుత్వ బడుల్లో విద్యాప్రమాణాలు, మౌలిక వసతులు, ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే పుస్తకాలు, ఇతర సామగ్రిని వివరిస్తున్నారు. ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులు సాధించిన ఫలితాల గురించి కరపత్రాలను ముద్రించి తల్లిదండ్రులకు అందిస్తున్నారు. పదో తరగతి ఫలితాలకు సంబంధించి మెరిట్ విద్యార్థుల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలు ఆయా పాఠశాలల వద్ద ఏర్పాటు చేసి తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేలా మండల విద్యాధికారులకు, ప్రధానోపాధ్యాయులకు ఉన్నతాధికారులు మార్గదర్శకత్వం చేస్తున్నారు.

అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టి



ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తోంది. విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు ఉన్నాయి. ప్రభుత్వ బడులు ప్రైవేట్ స్కూళ్లకు ధీటుగా ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. విద్యార్థులు సర్కారు బడుల్లో చేరి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి.
– మధుసూదన్‌రెడ్డి, ఎంఈఓ–2, వింజమూరు

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు



సంగం: బహుమతులు అందుకున్న విద్యార్థులతో లైబ్రేరియన్ రవీంద్రనాథ్‌రెడ్డి



అల్లూరు: విద్యార్థికి బహుమతి అందజేస్తున్న లైబ్రేరియన్ కోటేశ్వరమ్మ

సంగం: స్థానిక శాఖా గ్రంథాలయంలో గత నెల 15వ తేదీ నుంచి నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు డి.వేణుగోపాల్, మాల్యాద్రి, వంశీకృష్ణ, లైబ్రేరియన్ రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ వేసవిలో విజ్ఞాన శిబిరాల ద్వారా విద్యార్థులు విజ్ఞానం పెంపొందించేకునే అవకాశం కలిగిందన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

శాఖా గ్రంథాలయంలో..

అల్లూరు: గత 20 రోజులుగా అల్లూరులోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు శుక్రవారంతో ముగిశాయని లైబ్రేరియన్ కోటేశ్వరమ్మ తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తొలకరి కాలం.. వ్యాధుల ముప్పు



మేకకు వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్య సిబ్బంది

- పశువులకు గాలికుంటు, గొంతువాపు వ్యాధులు సోకే అవకాశం
- ముందస్తు టీకాలతో అడ్డుకట్ట



పశువుకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

సీతారామపురం: వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో పశువులకు సోకే వ్యాధులపై పాడి రైతులు, పశుపోషకులు ఆందోళన చెందుతున్నారు. మెట్టప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో రైతులు వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమకు అధిక ప్రాధాన్యం ఇస్తుంటారు. పంట సాగులో నష్టమొచ్చినా, కరువు కమ్ముకొచ్చినా కలిగే లోటును పాడిపరిశ్రమతో పూడ్చుకొని జీవనం సాగిస్తుంటారు. అలాంటి కీలక ఆధారమైన పశువులకు వర్షాకాలంలో సోకే వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యులు హెచ్చరిస్తున్నారు. వర్షాకాలంలో పశువులకు గొంతువాపు, జబ్బవాపు, గాలికుంటు వంటి వ్యాధులు సోకే ప్రమాదముంది. ఇవి జూన్ నుంచి సెప్టెంబర్ మాసం వరకు తొలకరి సమయంలోనే అధికంగా వ్యాప్తిచెందుతుంటాయి. ఈ వ్యాధులు సోకితే పాల దిగుబడి తగ్గడంతోపాటు పశువులు మృతిచెందే ప్రమాదం కూడా ఉంది. దీంతో పాడిరైతులు నష్టపోవాల్సిన పరిస్థితి ఉంటుంది. వర్షాకాలంలో కలుషితమైన నీరు, మేత కారణంగా పశువుల్లో రోగ నిరోధకశక్తి తగ్గి పలు వ్యాధులు సంక్రమిస్తుంటాయి. దీంతో పశువులకు సోకే వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది. సీతారామపురం, ఉదయగిరి మండలాల్లో 2,889 ఆవులు, ఎద్దులు, 26,999 గేదెలు, 96,303 గొర్రెలు, 27,962 మేకలు ఉన్నాయి.

టీకాలు తప్పనిసరి

పశువులకు వర్షాకాలంలో సోకే వ్యాధుల నివారణకు ముందస్తుగా టీకాలు తప్పనిసరిగా వేయించాలి. కొందరు రైతులు పాల దిగుబడి తగ్గిపోతుందని టీకాలు వేయించేందుకు వెనకడుగువేస్తారు. టీకాలు వేయడంతో పాల దిగుబడి తగ్గిపోతుందనేది ఒక అపోహ మాత్రమే. అలాంటిదేమీ జరగదని పశువైద్యులు చెబుతున్నారు. వ్యాధులు ముదిరి పశువులను కోల్పోవడం కన్నా ముందస్తు టీకాలు వేయిస్తే వ్యాధులు సోకకుండా నివారించవచ్చని వైద్యులు చెబుతున్నారు.

గొంతువాపు అంటువ్యాధే

వర్షాకాలంలో ప్రధానంగా పశువులకు గొంతువాపు వ్యాధి సోకుతుంది. దీనినే గురక వ్యాధి అని కూడా అంటారు. గేదెలు, ఆవులు, దూడల్లో ఈ వ్యాధి ఎక్కువగా వ్యాపిస్తుంది. ఒక్కోసారి గొర్రెలు, మేకల్లో కూడా వ్యాపిస్తుంటుంది. ఇది అంటువ్యాధి. కంటి నుంచి నీరు, నోటి నుంచి నురగ కక్కుతూ గురక, శ్వాస పీల్చడం కష్టమవుతుంది. జ్వరం తీవ్రత 107 డిగ్రీల వరకు ఉండి, గొంతు కిందికి నీరు దిగి గొంతు వాపు వస్తుంది. ఈ వ్యాధి సోకిన 24 గంటల్లో పశువులు మరణించే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

గాలికుంటుతో తీవ్ర జ్వరం

గాలికుంటు వ్యాధి తల్లిపాల ద్వారా దూడలకు సోకే అవకాశముంటుంది. ఏటా వర్షాకాలంలో గేదెలు, ఆవులకు వచ్చే వ్యాధుల్లో గాలికుంటు ఒకటి. గిట్టలు ఉన్న ప్రతి జీవికి ఈ వ్యాధి సోకుతుంది. జ్వరం తీవ్రత 105 డిగ్రీల వరకు ఉండి నోటిలో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడి పశువులు నడవలేని స్థితికి చేరుకొని మేత తీసుకోలేక నీరసిస్తాయి. ఈ వ్యాధుల వ్యాప్తిపై పశుపోషకులు, జీవాల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

ముందస్తు టీకాలు వేయించాలి



ప్రస్తుతం వర్షాల సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో పాడి రైతులు పశువులకు సోకే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి. ముందస్తుగా టీకాలు వేయిస్తే మంచి ఫలితం ఉంటుంది. అలాగే జాగ్రత్తలు పాటించడంతోనూ వ్యాధుల నివారణకు అవకాశముంది. ప్రస్తుతం టీకాల కార్యక్రమం జరుగుతున్నందున పాడి రైతులు పశువులకు ముందస్తుగా టీకాలు వేయించాలి.
– అనూష, మండల పశువైద్యాధికారిణి, సీతారామపురం

కనకదుర్గాదేవి వార్షిక ఉత్సవాలు ప్రారంభం



విశేషాలంకరణలో కనకదుర్గాదేవి అమ్మవారు

ఆత్మకూరురూరల్: మండలంలోని రామస్వామిపల్లిలో శ్రీకనకదుర్గాదేవి అమ్మవారి ఆలయంలో వార్షిక ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అర్చకులు అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. రాత్రి భక్తులకు అన్నదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా భక్తులు కోలాటం, చెక్కభజన, పండరి భజన ప్రదర్శించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

నేటి నుంచి రాములోరి ఉత్సవాలు

ఆత్మకూరు: చేజర్లలోని దక్షిణవీధిలో వెలసిన కోదండ రామాలయంలో శనివారం నుంచి రాములోరి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ఉదయం కలశ స్థాపన, అంకురార్పణ, సాయంత్రం గరుడ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం, ఆదివారం ఉదయం సీతారాముల కల్యాణం, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం పార్వేట, ఉట్టి మహోత్సవ కార్యక్రమాలు జరపనున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఘన సన్మానం



బ్యాంకు మేనేజర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది, గ్రామస్తులు

ఆత్మకూరు(చేజర్ల): చేజర్ల మండలం ఆదూరుపల్లిలోని కెనరా బ్యాంకు మేనేజర్ సాహస్‌బాబు తమిళనాడులోని హోసూరుకు బదిలీ అయిన నేపథ్యంలో ఆయనను సిబ్బంది, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం ఆ బ్యాంకు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సన్మానించారు.

వార్షికోత్సవం



సీతారామపురం: మండలంలోని అయ్యవారిపల్లి ఎస్సీకాలనీలో శుక్రవారం ఇమ్మానుయేలు ప్రార్థనా మందిరం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ప్రార్థనా మందిరం వ్యవస్థాపకుడు బొబ్బా అంకాళయ్య సతీమణి జయమ్మ అన్నదానం చేశారు. కార్యక్రమంలో పాస్టర్ భానుదయాకర్, సంఘకాపరి పాస్టర్ రాహుల్ పాల్గొన్నారు.

మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు



ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

సంగం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ అశోక్, సబ్ యూనిట్ అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ మాట్లాడుతూ వర్షాలు ఆరంభమైన నేపథ్యంలో ప్రజలు వారి పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, మురుగు చేరితే మలేరియా జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమతెరలు వినియోగించాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి ఇంట్లోని పాత్రలన్నింటినీ శుభ్రం చేసి నీటి నిల్వలను తొలగించాలన్నారు. ప్రజలందరూ కాచి చల్లార్చిన నీరు మాత్రమే తాగాలని, వేడిగా ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఎవరైనా రెండు రోజులకు మించి జ్వరంతో బాధపడుతుంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మలేరియా పరీక్షలు చేయించుకుని వైద్యసేవలు పొందాలన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి ఎస్‌కే ఖాదర్‌బాషా, ఎంపీహెచ్ఓ మల్లి కొండయ్య, హెచ్ఈ ఆరోగ్య మేరీ, హెల్త్ సూపర్‌వైజర్ జలీల్‌అహ్మద్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సీతారామపురం: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1996–2001 మధ్య ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు 23 ఏళ్ల తర్వాత శుక్రవారం ఆ పాఠశాలలో కలుసుకున్నారు. వారంతా అప్పట్లో పాఠశాలలో గడిపిన మధుర క్షణాలను గుర్తుచేసుకుని సందడి చేశారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అప్పట్లో వారికి విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

బావి నీరు కలుషితం



బావి నీటిని పరిశీలిస్తున్న వైద్యాధికారి శ్రీకాంత్‌రెడ్డి

సోమశిల: అనంతసాగరంలోని గుంతబజార్ ప్రజలు వినియోగిస్తున్న నీరు కలుషితమైందని, ఆ నీటినే ప్రజలు తాగుతున్నారని, కొద్దిరోజులు ఆ నీటి వినియోగాన్ని ఆపాలని అనంతసాగరం పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. శుక్రవారం గుంతబజార్‌లో ప్రజలు వినియోగిస్తున్న బావి నీటిని వైద్యుడు శ్రీకాంత్‌రెడ్డి పరీక్షించారు. కాలువల్లోని నీరు అక్కడికి చేరడంతో బావి నీరు కలుషితమవుతోందని, ఈ నీటినే వాడితే డయేరియా వచ్చే అవకాశం ఉందని తెలిపారు. రానున్న వర్షాకాలంలో ఈ నీరు తాగితే ప్రజలు రోగాల బారిన పడతారని, తప్పనిసరి పరిస్థితుల్లో ఈ నీటినే వినియోగించాలంటే క్లోరినేషన్ అనంతరం కొద్దిరోజుల తరువాత వినియోగించాలని, ఆ సమయంలో కూడా కాచి చల్లార్చిన తరువాతే వాడాలని సూచించారు. అలాగే ప్రతి వారం బావిని క్లోరినేషన్ చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట హెల్త్‌అసిస్టెంట్ ప్రసాద్, అబ్దుల్ ఖాదర్, ఎంఎల్‌హెచ్‌పీ ముషాల్, ఏఎన్ఎం ఖాజమ్మ, పంచాయతీ కార్యదర్శి మోహన్ కిషోర్, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రీతి, ఆశా కార్యకర్తలు కమలమ్మ, సాబిర ఉన్నారు.

పైనాపురంలో ఆరోగ్య సర్వే



సర్వే నిర్వహిస్తున్న జనవిజ్ఞాన వేదిక నాయకులు

ముత్తుకూరు: మండలంలోని పైనాపురం పంచాయతీలోని దేవరదిబ్బ గిరిజనకాలనీ, వాగర్త దళితవాడలో నెలకొన్న అనారోగ్య పరిస్థితులపై జనవిజ్ఞాన వేదిక నాయకులు శుక్రవారం సర్వే చేపట్టారు. జేవీవీ హెల్త్ సబ్ కమిటీ కన్వీనర్, రామచంద్రారెడ్డి ఆస్పత్రి సీనియర్ డాక్టర్ శీనునాయక్ ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 మంది వాంతులు, విరేచనాలతో ఆస్పత్రి పాలై చికిత్స పొందుతున్నారన్నారు. వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వేదిక జిల్లా అధ్యక్షుడు ఉదయభాస్కర్, కార్యదర్శి కృష్ణారెడ్డి, నాయకులు మాదాల రాము, విజయకుమార్, మోహన్‌రెడ్డి, గడ్డం అంకయ్య పాల్గొన్నారు.

వినాయకుడికి పూజలు



నెల్లూరు సిటీ: బుజబుజనెల్లూరులోని బీజేపీ కాలనీలో కొలువైన లక్ష్మీగణపతికి పంచామృతాభిషేకం తదితర పూజా కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. అర్చకుడు రాజా ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం అన్నదానాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా దయాకర్‌రెడ్డి, రమేష్, సుధాకర్ తదితరులు వ్యవహరించారు.

క్రీడాకారులకు పౌష్టికాహార పంపిణీ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిబిరాల్లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బరాజు మాట్లాడారు. అసోసియేషన్ సభ్యుడు నందిమండలం బాలకృష్ణంరాజు సౌజన్యంతో కార్యక్రమాన్ని చేపట్టామని వివరించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు నేతాజీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అప్రమత్తత అవసరం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

కొడవలూరు: మలేరియాపై ప్రతిఒక్కరిలో అప్రమత్తత అవసరమని వైద్యాధికారి ఎం రామకృష్ణ సూచించారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా మండలంలోని నార్తురాజుపాళెంలో కొడవలూరు పీహెచ్‌సీ సిబ్బంది శుక్రవారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమకాటుతో మలేరియా సోకుతుందన్నారు. చలి, జ్వరం మలేరియా లక్షణాలు అని, అవి ఉంటే వెంటనే పీహెచ్‌సీలో సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, కిడ్నీ, రక్త గ్రూపు, తదితర అన్నీ రకాల పరీక్షలు పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను నివారించవచ్చన్నారు. రాత్రి వేళల్లో దోమతెరలు ఉపయోగించడం ద్వారా దోమలతో సంక్రమించే వ్యాధుల బారి నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి బాలచంద్రబాబు, ఎస్‌యూఓ నాగరాజు, హెచ్‌వీ సుజాత, ఎంఎల్‌హెచ్‌పీ స్నేహ, హెచ్‌ఏ సుధాకర్, ఏఎన్ఎం సలోమి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.